క్లుప్తంగా

'దోస్త్' అడ్మిషన్లకు చివరి అవకాశం

స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ రూరల్ : డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ)లో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు చివరి అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ రహత్‌ఖానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ఆర్థికసాయం



స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు తాళ్లపల్లి అశోక్‌బాబు ఇటీవల మృతిచెందాడు. కాగా మృతుడి కుమారుడు నరేందర్‌కు అతడి మిత్రులు పరామర్శించి, శనివారం రూ.6,500ల ఆర్థికసాయం అందజేశారు.

విద్యుత్ తీగలను సరిచేశారు



స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని నమిలిగొండ నర్సరీ వద్ద వ్యవసాయ భూముల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి కరెంట్ తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. ఈ విషయంపై 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు–పట్టించుకోని అధికారులు'శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించారు. విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం మరమ్మతులు చేపట్టారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలరు సరి చేసి వేలాడుతున్న వైర్లను సరిచేశారు. ఈ సందర్భంగా ఏఈ శివకుమార్ మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ సమస్యను ప్రచురించిన సాక్షికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


సాక్షి ఎఫెక్ట్..

పేద విద్యార్థులకు చేయూత



జనగామ : జనగామ పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఎన్ఆర్ఐ చేయూత నిస్తున్నారు. చొల్లేటి యశోదరెడ్డి ట్రస్ట్ నిర్వాహకులు, డాక్టర్ చొల్లేటి రాజా నరేందర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి పాటు పడుతున్నారు. పదో తరగతిలో 565మార్కులతో బాసర ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించిన విద్యార్థిని మేడారం రుచికకు రూ.25వేల మొబైల్ ఫోన్‌తో పాటు ఒకేషనల్ విద్యార్థులకు కుట్టు మిషన్లను అందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ తరఫున సీనియర్ ఉపాధ్యాయుడు ఎ.నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వి.కృష్ణమూర్తి, విద్యార్థికి మొబైల్, కుట్టు మిషన్లను అందజేశారు.

సామగ్రి అందజేత



దేవరుప్పుల : మండలంలోని హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్ మల్కాజిగిరిలోని మిషన్ మోడ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ దత్తత తీసుకున్నారు. శనివారం పాఠశాలకు అవసరమైన పెయింటింగ్స్, కంప్యూటర్, మైక్ సెట్, షూ, టై, బెల్ట్, ఐడీ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నీలం నర్మద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ కళావతి, కామారెడ్డిగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జినుకల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. సంస్థ ప్రతినిధులు గౌతమ్ మాట్లాడుతూ.. పాఠశాలకు రూ.75వేల విలువైన వస్తువులు అందజేశామన్నారు. విక్రమ్, చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి



బచ్చన్నపేట : ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, మండల వైద్యాధికారి సృజన సూచించారు. శనివారం మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలో పర్యటించి మురుగు కాల్వల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో డెంగి జ్వరాలు ఎక్కువ ప్రబలుతున్నాయని, ముఖ్యంగా దోమకాటును నివారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధర్మ సతీష్‌రెడ్డి, ఏఎన్ఎం, సూపర్‌వైజర్, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం

- రోడ్లపై అదుపు తప్పుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రమాదకరంగా బోనకొల్లూర్–లక్ష్మాపూర్ రోడ్డు



సాల్వాపూర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బచ్చన్నపేట : మట్టిరోడ్లపై వాహనదారులు ప్రయాణం చేయలేక నరకం అనుభవిస్తున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనాలు అదుపు తప్పుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మధ్యగల ప్రమాదకరమైన మట్టి రోడ్లను అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని బండనాగారం–కట్కూర్, సాల్వాపూర్–వట్టిపల్లి, లక్ష్మాపూర్ వయా బోనకొల్లూర్ మీదుగా కేసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట–ఎద్దుగూడెం, మొండికుంట చిన్న రామన్‌చర్ల మీదుగా పోచన్నపేట, కొన్నె–నాగిరెడ్డిపల్లి గ్రామాల మధ్య మట్టి రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయి. కట్కూర్ నుంచి బండనాగారం గ్రామం వరకు ఉన్న మట్టి రోడ్డుకు బీటీ రోడ్డు మంజూరు చేసినా, దాని నిర్మాణానికి ఇంత వరకు ఎవరూ టెండర్లు వేయలేదు. దీంతో ఆ రోడ్డుపై ఆర్టీసీ బస్సులు కూడా నడిపించడం లేదు. మట్టి రోడ్లపై విద్యార్థులు సైకిళ్లపై ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తుంటారు. ఈ వర్షాకాలంలో బురదలో అదుపు తప్పి విద్యార్థులు కిందపడి పోతున్నారు. ఆయా గ్రామాలకు ఆటో సౌకర్యం కూడా లేదు.రాత్రి వేళ ఏమైనా అనుకోని సంఘటన, ప్రమాదం జరిగితే వారి బాధ వర్ణనాతీతం. రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులకు గుంతలు కనబడక అందులో అదుపు తప్పి కింద పడుతున్నారు. గుంతల రోడ్డుతో వాహనాలు తరచూ రిపేర్‌కు వస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మట్టి రోడ్లకు మోక్షం కలిగించాలని సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీ రోడ్లు మంజూరు చేయించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నరకం అనుభవిస్తున్నాం..



సాల్వాపూర్ నుంచి వట్టిపల్లికి ప్రయాణమంటేనే భయమవుతుంది. మట్టి రోడ్లపై వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నాం. ప్రజాప్రతినిధులు తూతూ మంత్రంగా మట్టి పోసి చేతులు దులుపుకోవడంతో వర్షాలు మొదలు కావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. వర్షపు నీటికి ఏర్పడ్డ గుంతల్లో వాహనాలు అదుపు తప్పి కిందపడుతున్నారు.

– మల్లేష్, సాల్వాపూర్

పాఠశాలకు వెళ్లడం లేదు



బోనకొల్లూర్ నుంచి బండనాగారం, కేసిరెడ్డిపల్లి గ్రామాలకు మట్టి రోడ్లు ఉన్నాయి. దీంతో మా గ్రామానికి అసలు బీటీ రోడ్డే లేదు. విద్యార్థులు 5వ తరగతి తర్వాత కేసిరెడ్డిపల్లికి సైకిళ్లపై వెళ్లాలంటే గుంతలమయంగా ఉన్న రోడ్లపై వెళ్లలేక పోతున్నారు. ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించడం లేదు. సరియైన రోడ్డులేక వారి చదువులు ఆగిపోతున్నాయి.

– మీస శ్రీనివాస్, బోనకొల్లూర్

సామాజిక చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

- కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జనగామ రూరల్: ఆగస్టు 2 నుంచి 18వ తేదీ వరకు జిల్లాలో అమరులయాదిలో సామాజిక చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో చైతన్య యాత్ర నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఓబుల్ కేశవాపూర్ గ్రామంలో ప్రారంభమై ఖిలాషాపురం కోటతో పాటు జిల్లా కేంద్రంలో ఈ యాత్ర ముగుస్తుందన్నారు. కల్లుగీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య, ఉపాధ్యక్షులు జొన్నగోని శ్రీనివాస్, బండపల్లి శంకరయ్య, కమిటీ సభ్యులు పర్శరాములు, వడ్లకొండ వెంకటేష్, రాజయ్య, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

'హామీల అమలులో విఫలం'

పాలకుర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం బమ్మెరలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని గోపాల్‌గౌడ్, ఇన్‌చార్జ్ కమ్మగాని నాగన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి నాగిరెడ్డి, దార శంకరయ్య, వన్నకూస యాకయ్య, బత్తిని దేవయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ



చిల్పూరు: షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

బచ్చన్నపేట /తరిగొప్పుల/చిల్పూరు : నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయా మండల కేంద్రంలోని పలు ఎరువుల షాపులను మండల వ్యవసాయ అధికారులతో కలిసి వారు తనిఖీ చేశారు. తరిగొప్పుల ఎస్సై గుగులోత్ శ్రీదేవి,చిల్పూరు ఎస్సై రాజేష్, బచ్చన్నపేట ఎస్సై ఎస్కే అబ్దుల్ హమీద్ స్టాక్ రిజిస్టర్లను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎరువుల బస్తాలను ఇచ్చే సమయంలో వారి పేరున ఆధార్ కార్డుతో ఆన్‌లైన్ తప్పకుండా చేయాలన్నారు. ఎవరైనా డీలర్లు యూరియాను ఉద్దేశపూర్వకంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే సదరు డీలర్‌పై చర్యలు తీసుకోబడతాయని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు అధైర్యపడకూడదని తెలిపారు. ఏఓలు, డీలర్లు, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్‌దివస్



జఫర్‌గఢ్: కస్తూర్బాలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్ : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మేరా యువభారత్ వరంగల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కార్గిల్ విజయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. మేరా యువభారత్ వలంటర్ నవీన్ యాదవ్ మాట్లాడుతూ కార్గిల్ విజయ దినోత్సవాన్ని ప్రతి ఏటా జూలై 26న దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఎస్ఓ సీహెచ్ స్వప్నతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో..

జనగామ రూరల్ : కార్గిల్ విజయ్ దివస్‌ను బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్ గౌడ్, బీజేపీ జిల్లా నాయకుడు, రిటైర్డ్ ఆర్మీ కల్నల్ డాక్టర్ భిక్షపతి పాల్గొని మాట్లాడారు. దేశ సైనికుల సేవలు వెలకట్టలేనివని వారిని గౌరవించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు జంగా రాజవెంకట నర్సింహరెడ్డి, నాయకులు విజయ్, దడిగే రవి, చింతకింది సంతోష్, ఉల్లెంగుల రాజు, రాఫ్తార్ సింగ్, శ్రీకాంత్, పవన్, చందు పాల్గొన్నారు.

చిల్పూరు ఆలయంలో వార కల్యాణం



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు. పాల్గొన్న భక్తులు

చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణమాస మొదటి శనివారం వారకల్యాణం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. ఉదయం అర్చకులు వేదమంత్రాల నడుమ శ్రావణ దీపం వెలిగించిన అనంతరం స్వామి వారి వార కల్యాణం జరిపించారు. ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో చిల్పూరుకు చెందిన నారగోని నరేష్‌కుమార్–సుజని దంపతులు అన్నప్రసాదం వితరణ చేశారు.

వెండి కిరీటం బహూకరణ

బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఇదే దేవస్థానంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన బొల్లం కృష్ణ–సరిత దంపతులతో పాటు కుమార్తెలు దివ్య, శ్రావ్యలు 873 గ్రాముల వెండి కిరీటాన్ని శనివారం బహూకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావులకు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ మోహన్, రాజశేఖర్, రమేష్, బుచ్చయ్య ఉన్నారు.

పాఠశాలల్లో లైబ్రరీ తప్పనిసరి: ఎంఈఓ

నర్మెట : ప్రతీ పాఠశాలలో గ్రంథాలయాన్ని తప్పనిసరి ఏర్పాటు చేయాలని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య సూచించారు. ఈమేరకు శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన హెచ్ఎంలకు పలు సూచనలు చేశారు. విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంచే మేధాశక్తిని వృద్ధి చేసే గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు నీలం వేణు, గోపాల్‌రెడ్డి, కమల, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే'



జనగామ : రాష్ట్రంలోని పేదలకు తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. శనివారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు వెంకటేష్, యుగంధర్, సత్యనారాయణ, రాజు, వెంకటేష్ ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

జఫర్‌గఢ్ : మండలంలోని వేల్పుగొండ కొండపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామి వారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.ప్రతి ఏటా శ్రావణ మాసంలో స్వామివారి జాతర జరుగుతుంది. జాతర ఉత్సవాలు శనివారం మొదటి రోజు కావడంతో దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాలినడక కొండపై ఎక్కి కోనేరులో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. కొండ దిగువన ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడ భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. అనంతరం కొండ దిగువన సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, పాలకుర్తి రాజయ్య, శ్రవణ్‌కుమార్, నాగరాజు, హరిశంకర్, సోమేశ్వర్, సుధీర్, సతీష్, రమేష్, శ్రీనివాస్, రామయ్య, అనిల్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవ స్వామి ఆలయంలో..

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని శ్రీమహదేవ స్వామి ఆలయంలో శనివారం శ్రావణ మాసం సందర్భంగా ఆలయ అర్చకులు పిండిపోలు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చింతకింది కృష్ణమూర్తి, రమేష్, మహేందర్, శ్రీశైలం, సంపత్, శ్రీకాంత్‌గౌడ్, కుమార్ పాల్గొన్నారు.

రేపు వైద్యనాథస్వామి దేవాలయంలో..

స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్ శివారులోని బైరవగుట్ట (తలకాయల గుట్ట)పై ఉన్న శ్రీ వైద్యనాథ స్వామి దేవాలయంలో శ్రావణమాస సోమవారం సందర్భంగా 28న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు, శివ భక్తుడు భూనేటి కిషన్‌రెడ్డి శనివారం తెలిపారు. రిజర్వాయర్ నీటితో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత దంత వైద్యశిబిరం



నర్మెట : గ్రామ పంచాయతీలో వామిక దంత వైద్యశాల జనగామ ఆధ్వర్యంలో చింతకింది రవి, చింతకింది సురేష్‌ల పర్యవేక్షణలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. దంత వైద్యులు చింతకింది విభ, సింగం నిధి 150 మందికి పైగా దంత పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి మందులు అందజేశారు. కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధులు, తేజావత్ గోవర్ధన్, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, కందకట్ల వీరమల్లు, శ్రీనివాస్, తీగుళ్ల భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ జనగామ కింగ్స్, లయన్స్ క్లబ్ జనగామ సూర్య సంయుక్తంగా నర్మెట ఉన్నత పాఠశాల ఆవరణలో నేడు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ కె.రంజిత్ కుమార్, లయన్ బోగ రామ్‌దయాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌కుమార్



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్ : వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పాఠశాలలు, హాస్టళ్లలో తప్పనిసరిగా పరిసరాల శుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నమిలిగొండ శివారులో గల ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను ఆర్‌బీఎస్‌కే బృందంచే కలిసి డిప్యూటీ డీఎంహెచ్ఓ సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంటశాలలను, స్టోర్స్‌ను పరిశీలించారు. వంటకు వాడే సరుకులను పరిశీలించి వంటకార్మికులతో మాట్లాడి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. వంట చేసే సమయంలో పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన, హ్యాండ్‌వాష్ మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు అజయ్‌కుమార్, ప్రణీత, రమ్య, హెచ్ఓ భగవాన్‌రెడ్డి, ఏఎన్ఎం మౌనిక, మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిడుగు పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికలపై విద్యార్థులతో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటింగ్ విధానం, లెక్కింపు, ఫలితాలు తదితర అంశాలపై విద్యార్థులకు మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సదానందం మాట్లాడుతూ..ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలను, ఎన్నికల విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు నవీన్‌రెడ్డి, సుధాకర్, నీరజ, శ్రవణ్‌కుమార్, రాజు, నరేందర్ పాల్గొన్నారు.

'ఆత్మగౌరవం కోసం పాటుపడాలి'



రాష్ట్ర సదస్సులో పాల్గొన్న శ్రీకాంత్ గౌడ్ తదితరులు

దేవరుప్పుల : బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ సాధ్యమని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించన బీఆర్ఎస్వీ రాష్ట్ర సదస్సుకు శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు తరలి వెళ్లారు. పాలకుర్తి, తొర్రూరు, దేవరుప్పుల, రాయపర్తి, కొడకండ్ల, పెద్దవంగర మండలాల నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రనుంచి విముక్తి పొందిన తెలంగాణను తిరిగి సీఎం రేవంత్‌రెడ్డి లాబింగ్‌తో చంద్రబాబుకు పలు సంస్థలు అంటగట్టిన ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. ఈలాంటి తరుణంలో యువజన విద్యార్థి నాయకులు అప్రమత్తంగా ఉంటూ ఆత్మగౌరవం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు పాల్గొని కాళేశ్వరం, బనకచర్ల ప్రాజెక్ట్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లా యువజన నాయకుడు ప్రవీణ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వడ్లకొండ వినయ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేల్పుకొండ వెంకటేష్, కార్యదర్శులు సుధీర్, రాజ్ కుమార్, దేశగాని సతీష్, గుండె రమేష్, మండల యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పందెనబోయిన మధు పాల్గొన్నారు.

చేప పిల్లలకు బదులు నగదు జమచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ, చిత్రంలో సంఘం జిల్లా నాయకులు

- టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

పాలకుర్తి టౌన్ : ప్రతి మత్స్యసొసైటీ ఖాతాలో నగదు జమచేయాలని తెలంగాణ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో టీఎంకేఎంకేఎస్ జిల్లా మూడో మహాసభను కరుణామూర్తి ప్రాంగణంలో నిర్వహించారు. సంఘం సీనియర్ నాయుడు అన్నెబోయిన భిక్షపతి జెండా ఆవిష్కరిచారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్న ప్రభుత్వం నేటికి ఉచిత చేపరొయ్య పిల్లల విషయంలో నిర్దిష్టమైన ప్రకటన చేయపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. జిల్లాలో అర్హులైన అనేక మంది మత్స్యకారులకు సొసైటీలో కొత్త సభ్యతం తీసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే విధంగా అధికారులు చర్యల తీసుకోవాలన్నారు. జిల్లాలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం లేకపోవడం బాధకారమని, వెంటనే చేపల ఉత్పత్తి కేంద్రం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రముఖ వైద్యుడు మాచర్ల భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్, నీరటి చంద్రయ్య, పిట్టల స్వరూప, చొప్పరి భిక్షపతి, రాజు, ఎల్లయ్య, తరాల చంద్రబాబు, మధు, సైదులు, ఉదయ, కవిత, కాట కృష్ణ, రామస్వామి, దండు కుమార్, శ్రీనివాస్, సోమయ్య 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

బచ్చన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ ధర్మపురి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని బోనకొల్లూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉడుగుల నర్సింహులు, బెజ్జాల నవీన్, యాకూబ్ పాషా, చిక్కుడు రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుతోంది

బచ్చన్నపేట : ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేద వారి సొంతింటి కల నెరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ అన్నారు. శనివారం మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి భూమి పూజ చేశారు. సంతోష్‌రెడ్డి, నర్సింహ, రవి, శ్రీధర్, సాయిరామ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కెనాల్ పరిశీలన

రఘునాథపల్లి : అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయగా, పంటపొలాలకు వెళ్లే కాల్వలను శనివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, నాయకులు జగదీశ్‌చందర్‌రెడ్డి, కోల్ల రవిగౌడ్‌లు మాట్లాడుతూ ఖిలాషాపూర్, కొత్తగూడెం, జాఫర్‌గూడెం గ్రామ కెనాల్ ద్వారా రైతులకు ఏ మేరకు సాగునీరు అందుతుందో పరిశీలించినట్లు తెలిపారు.

29న పెన్షన్‌దారుల సమావేశం

కొడకండ్ల : జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీ గార్డెన్‌లో ఈ నెల 29న పెన్షన్‌దారుల సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి పద్మశ్రీ మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ తెలిపారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన వీహెచ్‌పీఎస్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 13వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న పెన్షన్‌దారుల మహాగర్జనకు పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి టౌన్ : మండలంలోని మల్లంపల్లి, మంచుప్పుల, విస్నూరు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి శనివారం పరామర్శించారు.

అప్రమత్తంగా ఉండాలి

కొడకండ్ల : మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ జానకిరామ్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని రామవరం చెరువులో వాటర్ లెవల్‌ను పరిశీలించారు. ఎస్సైరాజు పాల్గొన్నారు.